శ్మశానంలో పశువైద్యశాల

- కర్మకాండలతో స్తంభిస్తున్న పశువైద్యసేవలు
- శిథిలావస్థకు చేరిన భవనం
- వర్షం పడితే ఉరుస్తున్న వైనం
- పాతికేళ్లుగా మోక్షం లేక సిబ్బంది, రైతులు సతమతం



శిథిలావస్థకు చేరినన పశువైద్యశాల భవనం



ఆస్పత్రి ఎదుట ఉన్న సమాధులు

కొడవలూరు: అది గ్రామంలోని నాలుగు సామాజిక వర్గాలకు చెందిన శ్మశానం. అందులో 29 ఏళ్ల క్రితం పశువైద్యశాలను నిర్మించారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు ఎవరైనా మృతి చెందితే పశువైద్యశాల మూతపడి పశువైద్య సేవలు స్తంభిస్తున్నాయి. మరోవైపు పశువైద్యశాల భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వానొస్తే భవనంలో తలదాచుకోవడం సిబ్బందికి కష్టంగా మారింది. వైద్యశాల చుట్టూ చిట్టడవిని తలపించేలా దట్టంగా చెట్లు ఉండడంతో పాములు చొరబడుతూ సిబ్బందిని బెంబేలెత్తిస్తున్నాయి. ఈ దుస్థితి మండల కేంద్రమైన కొడవలూరులో నెలకొంది.

కొడవలూరులోని పశు వైద్యశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. మండలంలోని అనేక గ్రామాల పాడి రైతులకు ఈ పశువైద్యశాలే ఆధారం. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ వైద్యశాల అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే వరుసలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి పక్కన ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండడంతో గ్రామానికి చెందిన నాలుగు సామాజిక వర్గాలకు గతంలో శ్మశానానికి కేటాయించారు. అప్పట్నుంచి ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు ఎవరు మృతి చెందినా ఇక్కడే ఖననం చేస్తుంటారు. వారి జ్ఞాపకార్థంగా సమాధులు కూడా నిర్మించుకున్నారు. కొంతకాలం ఇలాగే గడిచాక 1996 ప్రాంతంలో గ్రామానికి పశువైద్యశాల భవనం మంజూరైంది. ఆ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాల వరుసలోనే నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని భావించి శ్మశానానికి కేటాయించిన స్థలంలో ఖాళీగా ఉన్న కొంతభూమిలో నిర్మించారు. అప్పట్నుంచి వైద్యశాల కొనసాగుతోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఉరుస్తోంది. నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి పలు పర్యాయాలు ప్రతిపాదనలు పంపాం. భవనం మంజూరు కాలేదు. శ్మశాన స్థలంలో నిర్మించడం వల్ల విధులకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల పక్కనున్న ఖాళీ స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులను కోరాం.

– హర్షారెడ్డి, పశు వైద్యాధికారి, కొడవలూరు

ఎవరైనా మరణిస్తే వైద్యశాల మూతే

గ్రామంలోని నాలుగు సామాజిక వర్గాలకు చెందిన ఎవ్వరైనా మరణిస్తే శ్మశానంలో చిన్నకర్మ, పెద్దకర్మ చేస్తుంటారు. ఆ రెండ్రోజులు మృతుని బంధువులు శ్మశానం వద్దకు చేరుకుని కర్మకాండలు నిర్వహిస్తారు. ఆ సమయంలో ఆస్పత్రిని మూసి వేయాల్సి వస్తూ పశువైద్య సేవలు స్తంభిస్తున్నాయి.

వర్షం పడితే ఉరుపే

ఆస్పత్రి భవన నిర్మాణంలో నాణ్యత లోపించడంతో త్వరగా శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే భవనంలోని అన్నీ గదులు ఉరుస్తున్నాయి. తలదాచుకోవడం,వైద్యశాలలో నిల్వ ఉన్న మందులను కాపాడుకోవడం సిబ్బందికి ప్రహసనంగా మారుతోంది.

బెంబేలెత్తిస్తున్న పాములు

శ్మశాన ప్రాంతం కావడంతో వైద్యశాల చుట్టూ దట్టంగా చెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో ఈ ప్రాంతం పాములకు ఆవాసంగా మారింది.పట్టపగలే ప్రమాదకరమైన పాములు ఆస్పత్రిలోకి చొరబడుతుండడంతో సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

మరోచోట నిర్మించాలి



గతంలో శ్మశానంలోనే పశువైద్యశాలను నిర్మించారు. శ్మశానాన్ని మరోచోటుకు మార్చాలన్నా పెద్దల జ్ఞాపకార్థంగా నిర్మించుకున్న సమాధులు ఇక్కడే ఉన్నాయి. ఏడాదికోమారు ఇక్కడ సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. పశువైద్య సేవలకు ఇవన్నీ కాస్త ఆటంకంగా ఉంటాయి. పైగా వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రభుత్వ కార్యాలయాల వరుసలోనే ప్రభుత్వ స్థలం ఉన్నందున అక్కడే వైద్యశాలను పునర్నిర్మిస్తే బాగుంటుంది.

–పీ మురారి, కొడవలూరు

పీహెచ్‌సీ పక్కనున్న స్థలంలో నిర్మించాలి



స్థానిక పీహెచ్‌సీ పక్కన ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడ గతంలో వ్యవసాయశాఖ కార్యాలయ భవనాన్ని కొంత నిర్మించి వదిలేశారు. ఆ తరువాత వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఎంపీడీఓ కార్యాలయం పక్కన నిర్మించారు. పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరినందున పీహెచ్‌సీ పక్కనున్న స్థలంలో నూతన భవనాన్ని నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

–పీ బాలయ్య, కొడవలూరు

క్లుప్తంగా

అత్తాకోడలు పరస్పరం దాడులు

పొదలకూరు : పట్టణంలోని సినిమాహాలు సెంటరులో ఆదివారం అత్తా కోడలు పరస్పరం దాడులు చేసుకుని గాయపరచుకుని ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఎస్సై హనీఫ్ తెలిపిన వివరాల మేరకు..స్థానిక ఎమ్మార్వో కాలనీలో నివాసం ఉంటున్న బెల్లకొండ రామలక్ష్మమ్మ కుమారుడు మల్లికార్జున ఐదేళ్ల క్రితం శ్రీలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత వారు విడిపోయారు. అప్పట్నుంచి శ్రీలక్ష్మి నెల్లూరులో నివాసం ఉంటోంది. ఇటీవల మల్లికార్జున రెండో వివాహం చేసుకున్నట్లుగా తెలియడంతో శ్రీలక్ష్మి నిలదీసేందుకు అత్త వద్దకు వచ్చింది. ఈ క్రమంలో అత్తాకోడలు గొడవపడి పరస్పరం దాడులకు పాల్పడి గాయపరచుకున్నారు. పొదలకూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

కోవూరు: మండల పరిధిలోని రామన్నగారిపాళెం గేటు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. రామన్నగారిపాళేనికి చెందిన భీమతాటి కేశవులు తన టీవీఎస్‌మోపెడ్‌పై జాతీయ రహదారిపై నెల్లూరు వైపుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో కావలి నుంచి నెల్లూరు వైపునకు వస్తున్న కారు రామన్నగారిపాళెం గేటు సమీపంలో టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కేశవులు ఎడమకాలు, మెడపై తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో అపోలో వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

ఆర్యవైశ్య న్యాయవాదుల సమ్మేళనం



నెల్లూరు(లీగల్): స్థానిక అభిరామ్ హోటల్‌లో ఆర్యవైశ్య న్యాయవాదుల సమ్మేళనం ఆదివారం జరిగింది. తొలుత పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వారు నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది చుండూరు శ్రీహరి నారాయణ రావు, సీనియర్ న్యాయవాదులు వైవీ శేషయ్య, ఎం.కృష్ణ, ఎస్వీ ప్రసాద్, తట్టపర్తి వెంకటేశ్వర్లు, పచ్చిపులుసు శ్రీరాములు, చలువది వెంకటేశ్వర్లు, జూనియర్ ఆర్యవైశ్య న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన ఆటో స్టాండ్ల ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, మూలాపేట సెంటర్లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూతన ఆటోస్టాండ్లను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటివరకు ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, ఏఐటీయూసీ, రైతు సంఘం, ఇన్సాఫ్, ఆటో కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, షానవాజ్, సుబ్బరాయుడు, అజీజ్ అహ్మద్, మధు, ప్రసాద్, సునీల్, రెహమాన్, అంజయ్య, కొండయ్య, మునీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాను అలవాటు చేయడమే లక్ష్యం

- కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ప్రతిఒక్కరికీ యోగాను చేరువచేసి, మెరుగైన జీవన విధానాన్ని అలవాటు చేయడమే యోగాంధ్ర కార్యక్రమ ప్రధాన లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు నందన్ తెలిపారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పొదలకూరు రోడ్డులోని రామచంద్ర మిషన్, నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, చిల్డ్రన్స్ పార్క్ వద్ద నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ సామూహిక యోగా కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. రామచంద్ర మిషన్ ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ నందన్ హాజరై యోగాసనాలు, ధ్యానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వయసుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు కూడా యోగాను జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, రామచంద్ర మిషన్ జోనల్ కో–ఆర్డినేటర్ గంగాధర్, యోగా గురువులు ప్రవీణలత, శ్రీనివాస్, రామచంద్ర మిషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పులి వాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారికి పులివాహనోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఉభయకర్తలుగా స్థానిక పల్లిపాళెం గ్రామస్తులు వ్యవహరించారు.

విశ్వనాథస్వామి ఆలయానికి టేబుళ్ల బహూకరణ



మనుబోలు: స్థానిక రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయానికి రెండు టేబుళ్లను దాతలు కొండపల్లి శోభారాణి, శివకుమార్, హేమలత ఆదివారం బహూకరించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథునికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంజనేయుని విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



పొదలకూరు : పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజను ఆదివారం నిర్వహించారు. సుమారు 13 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని నిర్మించనున్నట్లు నిర్మాణ కమిటీ బాధ్యుడు చిర్రా రమణారెడ్డి వెల్లడించారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేసి ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారు వెంకట్రామిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, పోలంరెడ్డి నారాయణరెడ్డి, చొప్పా వెంకటేశ్వర్లు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య, దామోదరం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో భక్తజనం



యాత్రలో హనుమాన్, శ్రీరాముని విగ్రహాలు

పొదలకూరు : పట్టణంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక రామనగర్‌గేటు సెంటరు నుంచి వీరాంజనేయస్వామి దేవస్థానం వరకు, అక్కడి నుంచి నెల్లూరు మార్గంలోని కేఆర్ ఆర్‌నగర్ వరకు శోభాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా యువకులు బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్..జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు. శోభయాత్రలో హనుమంతుడు, శ్రీరామచంద్రమూర్తి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్ర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

విడవలూరు: మండలంలోని దంపూరులోని హరిజనవాడ మెయిన్ రోడ్డులో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి భారత రాజ్యాంగం ద్వారా బహుజనులు, బీసీలు, మైనార్టీలతో పాటు మహిళల అభ్యున్నతికి బంగారు బాటలు వేశారన్నారు. అనంతరం నవధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు ఇనగంటి సురేంద్రరెడ్డి, దూది విజయ రాఘవన్, శ్రీధర్‌నాయుడు, నాయకులు అచ్యుత్ రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, శ్రీహరిరెడ్డి, సత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మురళీరెడ్డి, హరిరెడ్డి, దళిత నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మనుబోలు: మండలంలోని జట్లకొండూరులో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆర్థిక సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.10 వేలు, రన్నరప్‌కు రూ.7 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పొదలకూరు : మండలంలో పదోతరగతి ఫలితాల్లో ప్రతిభకనబర్చిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మండల పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో పొదలకూరులో పురస్కారాలను అందజేశారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పూకోటి లక్ష్మీనారాయణ, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, మాడా రాధయ్య, మోహన్‌రావు, కామేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కాగులపాడుకు చెందిన కనుమూరు వేణుగోపాల్‌రెడ్డి, సుమతి దంపతుల కుమారుడు రాజేష్‌రెడ్డి వివాహం నెల్లూరులోని ఏఎన్నార్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై వధూవరులు రాజేష్ రెడ్డి, నిఖితను ఆశీర్వదించారు. బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు



తాటిపర్తి వద్ద ప్రమాదకరంగా రోడ్డు మలుపు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తిలో వృద్ధుల ఆశ్రమం వద్ద పొదలకూరు–సంగం రోడ్డులో మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పొదలకూరు–రాపూరు మార్గంలో మర్రిపల్లి చెరువు వద్ద రోడ్డు మలుపు వాహనచోదకులకు దడ పుట్టిస్తోంది. ఈ మలుపు వద్ద లెక్కకు మించి ప్రమాదాలు సంభవించాయి. పలువురు మత్యువాత పడగా, మరికొందరు గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. ఇక్కడ రోడ్డు అయితే వెడల్పు చేశారు. కానీ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో కొత్తగా ఈ మార్గంలో వెళ్లేవారు మలుపును గుర్తించలేక వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.



మర్రిపల్లి వద్ద ప్రమాదకరంగా రోడ్డు మలుపు

వేరుశనగ సాగుపై రైతుల ఆసక్తి

- పంట మార్పిడిలో భాగంగా విస్తారంగా సాగు
- సాగు విస్తీర్ణం పెరిగేందుకు అవకాశం
- గిట్టుబాటు అవుతున్న ధరలు



వేరుశనగ పంట

పొదలకూరు: మండలంలోని రైతులు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతులు మూస పద్ధతిలో ఒకే పంటలను సాగుచేస్తుండడంతో నష్టాలు చవిచూస్తున్నారు. పంటల మార్పిడిని పాటిస్తే లాభాలు గడించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల చెబుతుండడంతో ఈ పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. వేరుశనగకు గిట్టుబాటు ధరలు ఉండడంతో రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. నల్లపాళెం, దుగ్గుంట, తోడేరు, భోగసముద్రం తదితర ప్రాంతాల్లోని రైతులు తొలిసారిగా వేరుశనగ సాగుకు సమాయత్తం అయ్యారు. ఈ ఏడాది దుగ్గుంట పంచాయతీలో సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంత రైతులు నిమ్మ, వరి, మినుము, పెసర, పచ్చిశనగ, తదితర పంటల ను తప్పించి ఇతర పంటల సాగుపై దృష్టి సారించింది లేదు. దశాబ్దాల కిందట ఈ ప్రాంత రైతులు వేరుశనగ పంట సాగు చేపట్టారు తిరిగి ఇప్పుడు పంటల మార్పిడిలో భాగంగా సాగు చేపడుతున్నారు.

దిగుబడి వస్తే లాభాలే

రైతులు ఆశించిన విధంగా వేరుశనగ దిగుబడులు వస్తే లాభాలు బాగా వచ్చే అవకాశం ఉంది. పంట బాగా ఉంటే ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో వేరుశనగ ధర క్వింటా రూ.5,500 వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఎకరాకు రూ.80 వేల వరకు చేతికి వస్తుంది. ఇందులో ఖర్చులు రూ.50వేలు పోను రూ.30 వేల వరకు ఆదాయం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

మూడేళ్ల నుంచి సాగు



నేను మూడేళ్లుగా వేరుశనగ సాగు చేస్తున్నాను. ఆశించిన స్థాయిలో ఫలసాయం అందుతున్నా అకాల వర్షాల వల్ల కొంత నష్టం వాటిల్లుతోంది. నీటి అభ్యత ఉంటే లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఉంటుంది. ఇసుక నేల, ఏటి కాలువ గట్టున వేరుశనగ పంట దిగుబడి బాగా ఉంటుంది.

-కే.రామిరెడ్డి, రైతు, కొనగలూరు.